జూపాక సుభద్ర

# ఎంపీటీసి రేణుకెల్లు

కథ

రేగొండ మండలాఫీసుల సర్వ సభ్య సమావేశం జరుగుతుంది. ఒకరిని బట్టకుండ యింకొకరు మాట్లాడ్తుంద్రు. 'మా విలేజికి ఏమొస్తలేవు' అని ఒక సర్పంచి. 'మా విలేజికి కరెంటు లేదు ఎప్పుడొస్తది సారూ' అని యింకో సర్పంచి. 'మా వూరికి అగ్రికల్చర్ ఆఫీసరు రాక మూన్నెల్లయింది'. 'మా వూరి బోరింగులన్ని పాడయినయి యిప్పటికిది మూడో సమావేశం, అయినా ఏం ఫాయిద లేదు' ఒక ఎంపీటీసి లొల్లి వెట్టినట్లు మాట్లాడ్తుండు. 'మా వూల్లె బొచ్చెడు సమస్యలున్నయి మాట్లాడనీకి. అవి చెప్పెదానికి మీటింగున్నదని యింటిమేషనే వస్తలేదు. నాకెందుకు యింటిమేషను పంపుతలేరు. ఈ మీటింగు గూడ పక్కూ రోల్లతోని తెలుసుకొనొచ్చిన" అని రేణుకెల్లు ఎంపీటీసి నోరు పెద్దదిజేసి ఎంపిపిని (మండలాధ్యక్షుడు) అడుగుతుంది.

ఎంపిడివో, ఎం.ఆర్వో, సర్పంచులు, డీయీ, ఏయీ, ఎంపీటీసీలతో సర్వ సభ్య సమావేశం లొల్లి లొల్లిగున్నది. మాట్లాడెటోల్లు మాట్లాడ్తాంటే మండలాధ్యక్షుడు ఆ లొల్లిల సమాధానాలు చెప్పలేక పక్కన కూసున్న ఆఫీసర్ల దిక్కు జూస్తుండు. మాట్లాడకుండా కూచున్న సభ్యులు నోర్లు దెర్సి కండెల్లవెట్టి మాట్లాడెటోల్లను సూస్తుంద్రు.

'అందరు గుంపుగ మాట్లాడితెట్ల ఒకరొకరు మాట్లాడుంద్రి' అని ఒకరిద్దరు ఆడోల్లనే అదులా యిస్తుండు మండలాధ్యక్షుడు లింగయ్య. సర్వ సభ్య సమావేశానికి ముప్పై మందొస్తె సభ్యుల్లో నలుగురే ఆడోల్లు. అందులో ఎంపీటీసి రేణుకెల్లు ఒక్కతే. కిందికులపామె. ఆ లొల్లిని సదుమాంచుడు లింగయ్య వశం గావడం లేదు. 'మాట్లాడ్దాం కూసోంద్రి, మాట్లాడనీకె వచ్చినం గౌరవ సభ్యులు కూచోవాలె' అని అందరికి దండాలు బెద్తుండు. రేణుకెల్లు కాడికొచ్చేటాలకు లింగయ్య కోపమంతా ఆమె మీద దీర్సిండు. 'నువ్వే వున్నవా రేణుకెల్లూ! నీకే వున్నదా నోరు, నీకే వున్నయా సమస్యలు జెర తగ్గు... గిదే మ్మీటింగో ఎర్కుండే మాట్లాడ్తన్నవా నాట్ల, కలుపులకాడ లొల్లి వెట్టినట్లు గీడ వెద్తెట్ల' అని గట్టిగా వెటకా రంగా మాట్లాడంగనే అందరు నవ్వింద్రు గొల్లున.

రేణుకెల్లుకు మండలాధ్యక్షుడు అట్లా మాట్లాడుడు, అందరు హేళనగా నవ్వడం చాలా అవమానమనిపిచ్చింది.

'ఏంది లింగన్నా గింతమంది లొల్లిజేసి అడుగుతాంటే వాల్లకు మర్యాదగ సమాధానం జెప్పి, నేను మాట్లాడంగనే నన్ను పల్చనజేసి మాట్లాడుడు న్యాయమేనా' అని ఎదురడిగింది రేణుకెల్లు.

"అందరెట్ల మాట్లాడ్తంద్రు నువ్వెట్ల మాట్లాడ్తన్నవ్, లోకంల నువ్వే వున్నవా ఎంపీటీసివి" ఎంపిపి.

'వేరెటోల్లను పేర్లు బెట్టి మాట్లాల్లె, నన్నే పేరు బెట్టి అన్నవా లేదా' రేణుకెల్లు మాటకు మాటగా

'ఆ... అన్న, యిగ నీ అసోంటోల్లు దొర్కక అన్న' ఎకెసెక్కెంగ ఎంపిపి


'సూడు లింగన్నా, మండల ప్రసిడెంటువని మర్యాదగ మాట్లాడ్తన్న. నేను మాట్లాడంగనే నన్ను కంట్లె వెట్టుకుంటన్నవ్ యిట్లనే మాట్లాడితె మంచి గుండది' రేణుకెల్లు గట్టిగనే సమాధానమిచ్చింది.

ఎంపిపి లింగయ్యకు సర్రున కోపమొచ్చింది. 'ఏ... సప్పుడు జేక వూకో మాట్లాడినవ్గని, వూల్లె కూలి నాలి జేసుకొని యింట్ల గూసోకా" అను కుంట రేణుకెల్లు వూరి వుప సర్పంచి మోహన్ రెడ్డి దిక్కు చూసిండు. మోహన్‌రెడ్డి ఏమెరుగని యెల్లిపాయలెక్క లొల్లిని యింటుండు.

'నువ్వెవనివి యింట్ల కూసోమని చెప్పెదానికి, రాజకీయాలు నీ అవ్వసొమ్మా నీ అయ్యసొమ్మా' అన్నది నిల్సుండే. యింకా 'యిగో నువ్వు ప్రసిడెంటువైతేంది ఎవనివైతేంది ఆడిదాన్నని అనుకోకు నువ్వెంతో నేనంత' అని రేణుకెల్లు సమావేశంల ప్రసిడెంటు అని కూడా చూడకుండ మాట్లాడేటాలకు లింగయ్యకు అవమానమనిపించి రేణుకెల్లును కుంగదీసే మాటలందుకున్నడు. ప్రసిడెంటు ప్రతాపం జూపిచ్చిండు. "మొగడు మొద్దులు లేందానివి నువ్వో ఆడిదానివై మాట్లాడ్తన్నవా సావుపో గా సెర్లవడి"చెట్టును సెలిపినట్లు సెలిపిండు.

అందరు కామ్‌గ వీల్లిద్దరి జగడాన్ని మజాగ వింటుంద్రు. వుప సర్పంచి మోహన్‌రెడ్డికి లోపల పండుగే. సభ్యులకు సమాధానాలు చెప్పడం కంటే వీల్ల కొట్లాటనే బాగుందని సమావేశానికి హాజరైన ఆఫీసర్లు కూడా ఏమాత్రం జోక్యం జేసుకోకుండా, ఎవర్ని ఆపకుండా తమాష జూస్తుంద్రు. మండలాధ్యక్షుడు తన కంట్రోలింగు పవరెంతో చూడుంద్రని వుప సర్పంచి మోహన్‌రెడ్డికి లోపల





**మండల్ ప్రసిడెంటు లింగయ్య అన్న మాటలు తిట్లు చాన అవమానమైంది రేణు కెల్లుకు. 'వీన్ని బొందవెట్ట, వీన్నెత్క కట్కపోను, వీని నానం నరుక అందరితోని మంచిగనే వుంటడు నన్ను జూస్తెనే వీని కండ్లల్ల వుచ్చ బోసుకుంటడు.**

సల్లజెయ్యనీకి రేణుకెల్లు మీద సిందులు తొక్కుతుండు.

'ఏంది సారు ఎంపీటీసి ఎంపీటీసిగుండనే వుండది. గీమెకి ఏంటెల్సునని మాట్లాడ్తది అడ్డగోలుగ. గీమె పార్టీల ఎగదోస్తె వచ్చి మనల్ని ఎట్ల వడ్తె అట్ల మాట్లాడ్తది నోరున్న'దని గియన్ని గీ ఆఫీసుల సాగయి. ఆఫీసుల ఆఫీసు మర్యాదలతోని మాట్లాడాలె గిట్లా గూడెమ్మాటలేంది? యిట్లా మండల ప్రసిడెంటు లింగయ్య రేణుకెల్లును యిట్లా విలువ లేకుంట మాట్లాడ్తాంటే, తిడ్తాంటె, ఎవరు అడ్డుపడకపోవడంతోని ఏం జేయలేక రేణుకెల్లు బైటికొచ్చింది ఏడ్చుకుంట.

మండల్ ప్రసిడెంటు లింగయ్య అన్న మాటలు తిట్లు చాన అవమానమైంది రేణు కెల్లుకు. 'వీన్ని బొందవెట్ట, వీన్నెత్క కట్కపోను, వీని నానం నరుక అందరితోని మంచిగనే వుంటడు నన్ను జూస్తెనే వీని కండ్లల్ల వుచ్చ బోసుకుంటడు. వీన్ని నేనే మనలే. వూళ్లె గదిలేదు, గిదిలేదని మాట్లాడద్దా. ఏనాడు సమావేశమున్నదని యింటిమేషనే లేకపాయె వూళ్లె అందరు నన్ను గూడ అడుగతరు నీళ్లపైపులెప్పుడొస్తన్నయి, బోరింగులు పాడైనయి, మా వాడల కరెంటు బుగ్గలు పాడైనయని' గీ సమస్యలు సర్వ సభ్య సమావేశంల మాట్లాడకుండ ఎక్కడ మాట్లాడాలె. మాట్లాడితే సెట్టును దులిపినట్లు దులిపె వీనికేం నాశనగాలమో నన్ను గిట్ల కాల్సుక తినవట్టె. నా ఎన్క ముందట అడిగెటోడు లేడని, మొగడు లేందాన్నని వీనికి బాగ లోకువైపోయిన. లోకం గొడ్డువొయినట్టుంది. ఒక్కలన్నా 'ఏంది ప్రసిడెంటూ ఎంపీటీసీని, అందుట్ల ఆడామెను గట్ల మాట్లాడొచ్చునా' అని ఒక్క మాట గూడ సాయం రాకపాయె. నన్ను కానిపోని మాటలన్నందుకు ప్రసిడెంటుగాన్ని ఎట్లయిన వంగదీయాలె లేకుంటె నన్ను బత్కనియ్యడు. పోలీసులకు చెప్తె వాల్లన్న వీన్ని జెర సక్కంగ జేసి పంపుతరనుకున్నది. సీద పోలీస్టేషండ్లకు బొయింది.

రేణుకెల్లు వూరుగొండ గ్రామానికి ఎంపీటీసి. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ల అయిద్దాక సదివినంక తల్లిదండ్రులు సదువు బందువెట్టి పెండ్లి జేసిండ్రు. ఒక్క బిడ్డ పుట్టినంక పెనిమిటి 'పనికి ఆహార పథకం' పనికి బొయి పాము కుట్టి సచ్చిపొయిండు. మొగోనికన్న ఎక్కువ పనులు జేస్తదని, కోతలు కలుపులు, మోతలు, బాయి పనులు, బంటాల పనులు బండ జేసినట్లు చేస్తదని వూరిల పేరు. ఒక్క బిడ్డను మేనల్లునికిచ్చి పెండ్లిజేసి తోలింది. వూరుగొండ గ్రామం ఎస్సీ మహిళకు రిజర్వయితే, నోర్లేని ఒక ఎస్సీ మహిళని సర్పంచిగ నిల్పుండ బెట్టిండు ఆ వూరి యిదివరకు సర్పంచి మోహన్ రెడ్డి. అతను ఈసారి ఉప సర్పంచిగ నిల్చుం డు. వూళ్లె కొద్దిమంది ఆడోల్లు రేణుకెల్లు పేరును సూచించినా మోహన్‌రెడ్డి ఒప్పుకోలేదు. 'దానికి నోరెక్కువ చెప్పిన మాటినది, కిరికిరి మనిషి' వద్దన్నడు. వేరే పార్టీల సాంబిరెడ్డి, మోహన్‌రెడ్డి ప్రతినిధికి పోటీగ రేణుకెల్లును ఎంపీటీసీగ గెలిపిచ్చిండు.

రేణుకెల్లు కూలి నాలి పనులు గుత్తవట్టి చేస్తది. కూలి యెగ్గొడితే గల్లవట్టి వసూలు జేస్తది. ఒప్పుకున్న పని ఎగ్గొట్టకుంట జేస్తది. ఎంత యిమాందారో అంత గయ్యాలి గంపనుకుంటరు వూళ్లె. తన జోలికొస్తె బూతుకదుగి వొదిలిపెడ్తది. ఆడోల్లు రేణుకెల్లక్క తీరుగ ఒగనయ్యకు బయ పడకుంటుండాలె అని తనతో పంజేసే ఆడోల్లు యిష్టంగ జెప్పుకుంటరు.

ఎంపీటీసీగ గెల్చినంక 'ఎంపీటీసి ఏమేం పనుల్జెయ్యాలె పటేలా' అని యిదివరకు సర్పంచినడిగితే 'సూసి నేర్చుకోవాల్నే కూల్లు గుత్తలకు బట్టుడా ఎంపీటీసంటె' అని దాటేసిందు. గవర్నమెంటు కొత్తగా ఎన్నికైన పంచాయితీరాజ్ ప్రతినిధులకు ట్రేనింగిస్తే రేణుకెల్లు తనకు వచ్చిన అనుమానాలు, తెలువనియి వాల్లనడిగి కొన్ని తెల్సుకున్నది. వూళ్లె ఏమేం పనులుంటయి? ఫండ్సు ఎట్లా వస్తయి, ఎంపీటీసి విధులు బాధ్యతలేంటియి అనేటియి తెల్సుకున్నది. ట్రేనింగోల్లను 'సార్ మీరో తీరు చెప్తండ్రుగాని మా వూళ్లె మీరు చెప్పినట్టు లేదు' ట్రేనింగులు గీ పెద్ద పెద్ద సిటీలల్ల పెడితే ఎక్కడెక్కనో వున్న మా అసోంటి బుడ్డ పల్లెలోల్లు ఎట్లొస్తం సారూ! మాకు చార్జీలన్న యియ్యరాయె, మా మండలంలనే యిస్తె మంచిగుంటది సారూ గింత దూరం రానీకి శాన కష్టవడ్డం' అని కొత్త పాత లేకుంట అడిగింది. ట్రైనింగులిచ్చేవాల్లు రేణుకెల్లు చెప్పిందాన్ని సూచనలుగా పైకి చాలా సీరియస్‌గా నోటు చేస్కున్నరు.

రేణుకెల్లు కూలన్న ఎగ్గొట్టి వుపాసం బంటందిగానీ మీటింగులు ఎగ్గొట్టది. గ్రామాధికారి సర్పంచి కన్నా పెద్దగా అధికార బాధ్యతల్లేని ఎంపీటీసి రేణుకెల్లునే వూరోల్లు సమస్యల గురించి అడుగుతుంటరు. వూరి అభివృద్ధి పథకాలు సంక్షేమ పథకాలు, ముసలోల్ల పింఛను, రేషన్ కార్డులు అందకపోవడంను, వాటి సాంక్షన్‌కి మండలాఫీసుల కలెక్టరాఫీసుల చుట్టు తిరుగుతది. కొన్ని కొన్ని సాధించింది.

ఎంపీటీసి అంటే వున్నావుర బస్వ అంటే వున్ననన్నట్లుండాలె. గిలేని లేని సుద్దులు దీనికెందుకు? దీన్ని పక్కకు పెట్టకుంటే వూళ్లె దీనికి బలం బెరిగి నన్ను లెక్కజెయ్యరనుకొన్న ఉప సర్పంచి మోహన్‌రెడ్డి ఎంపీపి లింగయ్యకు బత్తెక్కిచ్చి తాగవోయించి ఒక్క పార్టీవోల్లని కట్టుకున్నడు. తనే ప్రత్యక్షంగా మాట్లాడితే పెద్ద కులపోడని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ అని దళిత సంగాలోల్లు వురికొస్తరు. మండల్ ప్రసిడెంటు లింగయ్య రేణుకెల్లు యిద్దరూ ఒక్క కులపోల్లే. అరే లింగయ్య దాన్ని పంజేయకుంట నువ్వే సూసుకోర. లేకుంటే మన పార్టి పల్చగైతదిరా అదున ఆడిదాని ముందట' అని లింగయ్యకు మోహన్‌రెడ్డి పొగేసిండు.

యీ కుట్రలన్ని వెట్టుకునే రేణుకెల్లును ఎట్లవడితె అట్ల మాట్లాడిండు లింగయ్య.

గీ లోపటి సంగతులు తెల్వని రేణుకెల్లు ఏడ్సుకుంట సీద పోలీస్టేషన్‌కు బొయింది.

'సార్ నమస్తే'- 'అ... నమస్తే రేణుకెల్లమ్మా గిడికొస్తివి ఏం సంగతి' కారెడ్డంగా ఎస్సై సార్ మన మండల ప్రసిడెంటు లింగయ్య నన్ను తిడ్తండు, అవుమానం జేత్తండు, హర్రాసు జేత్తండు" దుక్కాన్ని వుగ్గపట్టుకొని

చెప్పింది. 'నిజమేనా నిన్నేడిపిచ్చే మొగోడెవడు' పరాసికంగ.

'అబద్దమెందుకు జెప్త సారూ'.

'సరే నిన్నే ఎందుకు హరాస్ జేస్తుండు మండల్ ప్రసిడెంటు? ఆయన గూడ మీ కులపాయనే గదా' ఎకసెక్కెంగ ఎస్సై.

'మా కులపు మొగోల్లకు తెలివుంటే ఏనాడో బాగుపడుదురు'

'నీకు చదువొస్తదిగదా కంప్లైంటు రాసియ్యి' ఎస్సై నిర్లక్ష్యంగ.

పెన్ను పేపరడిగింది. 'ఎంపీటీసి వైయుండి పెన్ను పేపరు దగ్గరుంచుకోవా' ఎస్సై అనహనంగ. రేణుకెల్లు దరఖాస్తులు రాయడం నేర్చుకున్నది చదూకొని రాయరానోల్లకు కూడా చెప్తది. దరఖాస్తులేమున్నది బిషాద. పైన ఎడమసెయి దిక్కు ఎవరికిస్తున్నమో రాయాలె తర్వాత మనకు ఏంగావాలో చెప్పాలె కింద మన సంతకం వుంటె గదే దర్కాసు' అని రేణుకెల్లు చెప్పేది.

అట్లా దర్కాసు రాసి ఎస్సైకిచ్చింది. ఎస్సై అది జూసి "ఏంది గిట్లనేనా రాసేది' ఎవరు నేర్పిండ్రు? వచ్చి రాని సదువుల్లోని మా ప్రాణాల్దీస్తరు' రేణుకెల్లు ఆ దరఖాసు యివ్వంగనే ఎంపిపి లింగయ్యను పోలీస్టేషండ్లకు గుంజుతరని, వాని పనయితదని తలుసుకొని దుక్కమంత దెంకపాయినట్లనిపిచ్చింది. మనసు సల్లబడ్డట్టు పుర్సతుగ యింటికొచ్చింది. రేణుకెల్లు ఒక్కతే పోలీసు స్టేషన్‌కి బొయి దరఖాసు రాసిచ్చుడు ఏందో తనకుతానే ఏనుగెక్కినంత బలమని పిచ్చి తనమీద తనకు మంచి నమ్మకమొచ్చినట్లైంది. వారందాక జూసి రేణుకెల్లు మల్లా పోలీస్టేషన్‌కి బొయింది.

స్టేషండ్ల ఎస్సై లేడని తెలుసుకొని 'ఏంది సారు దర్కాసిచ్చీ గిన్ని రోజులాయె కేసు నల్లనైందా తెల్లనైందా ఏం దెల్వకపాయె' అని కానిస్టేబులును అడిగింది.'నీ దొక్క కేసే వున్నదా తొందరెందుకు సార్ వచ్చినంక రా' కానిస్టేబులు చెప్పంగనే నిరాశగాబైటికొచ్చింది.

మాజి సర్పంచి మోహన్‌రెడ్డి, మండల్ ప్రసిడెంటు, ఎస్సై కుమ్మక్కై 'పిచ్చిముండ దానికేం పిన లేకిచ్చింది దర్కాసని' చింపేసి తిని తాగి పండుగ జేస్కున్న సంగతి రేణుకెల్లుకు తెల్వదు. అందుకే పోలీస్టేషన్‌కు తిరుగుతంది 'నా కేసేమైందని' యిట్లా పోలీస్టేషన్‌కు తిరుగుతుందని వూరిల, పోలీస్టేషండ్ల, పంచాదాఫీసుల, మండలాఫీసుల ఎంపిటీసి రేణుకెల్లును ఒక రకంగా జూసుడు, ఒక రరంగ మాట్లాడుడు రేణుకెల్లుకు కంపల్లకాలినడకే అయింది. మన్నంత పుండు పుండయింది. "నేంజేసిన తప్పేంది? రాజకీయంల వున్ననని మంచి సెడ్డ మాట్లాడితి. అట్లనే వుండాలె భయం లేకుండ మాట్లాడాలెనని వీల్లే ఎగేసిండ్రు. నేను గిది గదని అడగబోతే గిట్ల అడివి బట్టియ్యవట్టె. మాజి సర్పంచి మోహన్‌రెడ్డిగాడు వద్దన్నా నిల్సున్నందుకు వాని మాట కాదన్నందుకు ఎంపీపితోని కూడా నన్ను గింత గోసబుచ్చుకుంటుండు. నన్ను పామోలె పగవడ్తుండ్రు" అని బాగ బాదపడింది. 'గింత కత్తికోతల గీ బతుకెందుకని' విచారించుకొని రేణుకెల్లు పురుగుల మందు తాగింది. యింటి పక్కలోల్లు దావుకాండ్లేసిండ్రు.యిదే సందని పోలీసులు 'హత్యా నేరం' కింద సైలెంటుగ కేసు బెట్టిండ్రు. "నా దర్కాసు మీద సప్పుడు లేదుగాని గిప్పుడు నా మీద కేసు మాత్రం జెప్పన బెట్టిండ్రు పోలీసుగాడ్దులు" అని మనసులనుకున్నది.

రేణుకెల్లు దావుకాండ్ల నుంచి వచ్చినంక తన పార్టివాల్లతోని మాజి సర్పంచి మండల్ ప్రసిడెంటు సంగతి జెప్పింది. 'రాజకీయాల్లో యివి మామూలే' అని కొట్టేసిండ్రు.పార్టోల్లు యింటికి రావడం మీటింగులు బెట్టడం జరిగేయి. యింటికి మగవాల్లు ఆడవాల్లు రావడం, వాల్లతో ఎక్కడికి బడితే అక్కడికి మీటింగులకు బోవడం, అర్ధరాత్రి అపరాత్రి అనకుండా తిరగడం వూర్లె ఆమె పార్టి బలం బెంచుకోవడం, ఉప సర్పంచి మోహన్‌రెడ్డి సహించలేకపొయిండు కండ్లల్ల మంట వెట్టినట్లైంది. మండల్ ప్రసిడెంట్– 'గీ రేణు కెల్లి వల్లనే గాపార్టి పైలాయించుతంది. దీన్ని సక్కంగ జేత్తె' ఆ పార్టిని తొక్కేయొచ్చునుకున్నడు అని నిప్పు రాజేసిండు. బట్ట కాల్చి రేణుకెల్లు మీదేసిండు. "రేణుకెల్లు యింట్ల ఏం జరుగుతుంది జూస్తుండ్రా, ఎవడెవడో వస్తుండు పోతుండు గిట్ల జేస్తె మన వూరు పరువేం గావాలె, కులమిజ్జత్ యెటు బోవాలె"నని ఆమె కులపోల్లని ఎగేసి పొగేసిండు. సేతికి మట్టంటకుంట ఆమె యింటి మీదికి ఆమె కులపోల్ల చేతనే దాడి జేయించిండు. రేణుకెల్లు దొరింపుతోని తప్పించుకున్నది. లేకపోతే సావ సావ గొట్టెటోల్లు.ఎండబోసిన వడ్లను సిల్లం కల్లం జేసిండ్రు, జాలాట్ల నీళ్ళ కుండలన్ని పగలగొట్టిండ్రు. నులుక కోసం తెచ్చుకున్న తుంగనంత యిప్పి ఎగజల్లిండ్రు.



గొడువ జెర సల్లారినంక యింటికొచ్చింది రేణుకెల్లు. యిల్లంత లాయిరి లాయిరి జేసినందంత జూసి వాకిట్ల కూలవడింది. "గీ ఎంపీటీసి పాడుగాను వూకెనన్న నిలవడితి. న్యాయానికి కాలం లేదు. వూరు కోసం న్యాయం మాట్లాడినందుకే గద నా మీద కచ్చగట్టి గిట్ల బద్నాం జేస్తుండ్రు. ఉప సర్పంచి గాడు యిదంత జేయిస్తుండని వూరంత నుకుంటుండ్రు వాన్ని నేనేమంటిని, వాని జోలికి రాలే వార్తకు రాలే నన్ను గింత కత్తి కోతకు బెట్టవట్టిరి. వాడు జేపిత్తె గీ కులం గాడ్దులకు తెలువదా! యిగనన్న తెలివి తెచ్చుకోరా, వాల్లాడిచ్చినట్లు ఆడ్తరా నేను లెక్కలడిగిన్నని, పద్దతులడుగుతున్ననని, నోరున్నదాన్నని, గయ్యాలి దాన్నని బద్నాం జేసినా ఏ మనిపియ్యలే. కొత్తగ గిప్పుడు లంజిర్కం మీదేసిండ్రు అన్నం లేనోడు లంగ, ఆలిలేనోడు దొంగంటరు. గట్లనే మొగడు లేందాన్నని గిట్ల ఆగం జెయ్యవట్టిరి. ఏం జేతు దేవుడా, ఏడవోదు సచ్చిపొయినోడు వోకనన్ను గిన్ని కష్టాల వెట్టిపాయె. నన్ను గూడ తీస్కపోదాయె. లోకం గొడ్డువొయింది. కుల పెద్ద పాడుగాను వాడటే వుండె ఎవలికి జెప్పుకోను సెరలు. ఏ దేవుడు తెల్లార్పుత దు? పోలీసు గాడ్దికొడుకులు వట్టి లత్తకోర్లు. అల్లకు జెప్పినా ఏంగాలె. వూల్లె ఒక్కడన్న జెర పెద్దమనిషోలె ముందట బడ్డ మనిషే లేకపాయె. ఎవనితోని జెప్పినా వానికి నాకున్నదని అనుకుంటరు. ఏం బతుకాయెనని రేణుకెల్లు గండివడ్డ సెరువోలె శోకం బెట్టింది. సుట్టుపక్కల ఆడోల్లొచ్చి వూకుంచి 'పోలీస్టేషన్‌కు బొయి సెప్పు' అని సలహా యిచ్చిండ్రు. నా యింటి మీద దాడి జరిగిందని నన్ను చంపనీకి వచ్చిండ్రని రక్షణ కల్పించమని దర్కాసిచ్చింది. కాల్ల వేల్లబడి బతిమిలాడింది. ఎంపిటీసి రాసిచ్చిన దర్కాసు మీద గూడ మీరు ఏం చర్య దీసుకోలె... గిట్ల జేస్తె మా పార్టోల్లతోని లొల్లి జేయిస్త అని బెదిరించింది. పార్టోల్లతోని జెప్పినా వాల్లకుండే లాలూచీలతో వాల్లు పెద్దగా స్పందించలేదు. 'టైమొంది వాల్ల పని పడ్తాం' అన్నరు.

తర్వాత వూరి ఉప సర్పంచి, ఎంపిపి, ఎస్సై ఒకరోజు కల్సుకొని మందు పార్టి జేస్కొండ్రు. 'రేణుకెల్లు మల్లా కంప్లేంటిచ్చిందంట గదా' ఉప సర్పంచి మోహన్‌రెడ్డి గ్లాసుల మందు వంచుకుంట

'అవును సార్ గిదెక్కడ వడితె అక్కడ నన్ను మిమ్ముల్ని బేయిజ్జత్‌గ మాట్లాడ్తుందట' ఎస్సై సియ్య నోట్లేసుకొని–

'మరేంజేద్దాం ఎస్సై సార్' ఎంపిపి లింగయ్య మందు సప్పరిచ్చుకుంట. 'దాన్ని వూల్లె తిరుగకుంట జెయ్యాలె' వుప సర్పంచి

'దాన్ని వూల్లె తిరుగకుంట జెయ్యాలంటె ఒక్కటే మందు దాన్ని జేల్ల బెట్టాలె'

ఎస్సై సియ్య మింగుకుంటన్నడు. మల్లా గుటకేసుకుంట 'మీరేం బాదవడేది లేదు గా మద్దెన అది ఆత్మహత్య జేసుకున్నదని కేసు వెట్టినంగదా గది మూసెయ్యలే. మల్లా ఓపెన్ జేసి జేల్ల నూకితే ఖేల్ కతమ్'.

'గదేదో సెప్పుడుగాదు మొగడా సేసి సూపియ్యి' ఎంపిపి మైకంగన్నడు.

యిట్లా ప్లానేసుకొన్న తెల్లారి పోలీసులు రేణుకెల్లు యింటికొచ్చి ఆత్మహత్య నేరం కేసుకింద అరెస్టు జేస్తున్నమని కైకర మందర జేసి జేల్లబెట్టిండ్రు.'మీ తాడుదెంపా నేను మీ లంగపనులకడ్డమున్ననని నన్ను జేల్లేసిండ్రు. నా వుసురు బోస్కుంటుండ్రు. నా గోస మీకు మాగ తాకుతది' అని ఏడ్సుకుంట, లొల్లి బెట్టుకుంట బైటికొచ్చినంక వాల్లని బజారుకీడ్వకుంటే నా పేరే రేణుకెల్లు గాదనుకొన్నది ఎంపిటీసి రేణుకెల్లు.

•